క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 15, దొండ 21, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 12, ఆలుగడ్డ 19, చామగడ్డ 50, మొరంగడ్డ 15, కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

15న ప్రొ.కందాల శోభారాణి సంస్మరణ సభ



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: కేయూ ప్రొ.కందాల శోభారాణి సంస్మరణ (యాది) సభను ఈ నెల 15న నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ శనివారం తెలిపారు. నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభ విజయవంతం కోసం రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శనివారం విద్యార్థినేతలు, జర్నలిస్టులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చైతన్యాన్ని రగిలించి, ఆదివాసుల కోసం, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులపై ఆమె చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కోట ఆనంద్, రాజేంద్రప్రసాద్, శివ, శ్రీరాం, శ్రీనాథ్, అనిల్, దేవిసాయిప్రసాద్, సూరజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి నేతల ముందస్తు అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ: నగరానికి ప్రధాని నరేంద్రమోదీ రాకను వ్యతిరేకించిన బీఆర్‌ఎస్వీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను ఓయూలో అర్ధరాత్రి నుంచి ముందస్తు అరెస్టులు చేశారు. బీఆర్‌ఎస్వీ నాయకులు విజయ్, చటారి దశరథ్, జంగయ్య, నరేష్‌లతో పాటు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవినాయక్‌తో సహా 10 మంది విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి అంబర్‌పేట, ఓయూ పోలీస్టేషన్లకు తరలించారు. ఇదిలా ఉండగా ఎస్‌ఎఫ్‌ఐ, బీఆర్‌ఎస్ విద్యార్థి నాయకులు మోదీ రాకను నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు.

పరేడ్‌కు కదిలిన కమలనాథులు



సనత్‌నగర్ నుంచి డివిజన్ అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో..



బేగంపేట నుంచి వెళ్తున్న బీజేపీ శ్రేణులు



రాంగోపాల్‌పేట్ నుంచి వెళుతున్న కార్యకర్తలు

సనత్‌నగర్: పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే రహదారులు కాషాయ వర్ణాన్ని సంతరించుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు భారీగా వెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో బేగంపేట మీదుగా పరేడ్‌గ్రౌండ్ వైపు తరలివెళ్లారు. బేగంపేట ప్రధాన రహదారి మీదుగా పరేడ్‌గ్రౌండ్ వరకు బీజేపీ ఫ్లెక్సీలు, జెండాలు, హోర్డింగ్‌లు, తోరణాలతో నింపేశారు. సనత్‌నగర్ డివిజన్ నుంచి కన్నూరి క్రాంతికుమార్, బేగంపేట డివిజన్ నుంచి సీనియర్ నేత నెమలి ఆనంద్ (నందు) ఆధ్వర్యంలో కమలనాథులు సభకు బయలుదేరారు.

సికింద్రాబాద్ నుంచి..

సికింద్రాబాద్: పరేడ్ మైదానంలో జరిగిన ప్రధాని బహిరంగసభకు సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు ర్యాలీగా తరలివెళ్లారు. మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, పార్టీ నాయకులు కనకట్ల హరి, ముఠా నాగేశ్, లావణ్య తదితరుల నేతృత్వంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు.

లాలాపేట: మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి ఆధ్వర్యంలో తార్నాక, లాలాపేట జయశంకర్ స్టేడియం వద్ద నుంచి బస్సులు, సొంత వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాము వర్మ, ప్రకాష్‌గౌడ్, ఉపేందర్‌యాదవ్, సత్యవతి, ప్రమోద్ పాల్గొన్నారు.

మోండా మార్కెట్, రాంగోపాల్‌పేట్ డివిజన్ల నుంచి..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో శనివారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు మోండా మార్కెట్, రాంగోపాల్‌పేట్ డివిజన్లకు చెందిన బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో కార్యకర్తలు పరేడ్ మైదానానికి ఉత్సాహంగా వెళ్లారు.

రసూల్‌పురా: పరేడ్ మైదానంలో శనివారం జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు బీజేపీ కంటోన్మెంట్ నేతలు పరశురాం, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, రెండవ వార్డు నాయకులు జి. శాంసన్‌రాజుల ఆధ్వర్యంలో అన్నానగర్ చౌరస్తా నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గోనే పద్మ, మమత, జైపాల్, సత్యనారాయణ, శ్రీహరి, రాహుల్, సంపత్, సంజూ, కుమార్, వికాస్, రాజు, లక్ష్మి, రజిత, లత పాల్గొన్నారు.



మోండా మార్కెట్ డివిజన్ నుంచి తరలి వెళుతున్న కార్యకర్తలు



ప్రధాని సభకు ర్యాలీగా తరలివెళుతున్న సికింద్రాబాద్ బీజేపీ నాయకులు

నీడ కరువై.. చెట్లు నెలవై..



పరేడ్ గ్రౌండ్‌లో ఓ చెట్టు కింద కూర్చుని ప్రసంగం వింటున్న ప్రజలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభ ప్రజలు పోటెత్తారు. రైల్వే అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో పరిమితంగానే ఏర్పాట్లు చేశారు. మైదానం మధ్యలో కేవలం మూడు భారీ జర్మన్ షెడ్‌లలో గరిష్టంగా లక్ష మంది మాత్రమే కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. సభ ప్రారంభానికి ముందే ప్రధాన షెడ్‌లు పూర్తిగా నిండిపోయాయి. కూర్చీలు లేక కొందరు నేలపైనే కూర్చున్నారు. ప్రధాని ప్రసంగం ప్రారంభం అయిన వెంటనే మరో పది నిమిషాల్లో సభ ముగుస్తుందనగానే, అప్పటికే టెంట్‌లలో ఉన్న ప్రజలు తిరుగుముఖం పట్టారు. సభా ప్రాంగణంలో నీడ లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు గ్రౌండ్ ప్రహరీ వెంబడి ఉన్న చెట్ల కిందే కూర్చుని ప్రసంగాన్ని విన్నారు. మంచి నీటి సదుపాయం లేక సభకు వచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూర్చునేందుకు కుర్చీలు లేక, ఎండ ఎక్కువై, కనీసం ప్రసంగాన్ని స్క్రీన్‌ల లోనూ చూసే అవకాశం లేక సభ కొనసాగుతుండగానే చాలా మంది మధ్యలోనే లేచివెళ్లిపోయారు.



కుర్చీలు లేక నేలపైనే కూర్చున్న దృశ్యం

ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను చూపుతున్న దళిత బహుజన ఫ్రంట్ మహిళలు

అడ్డగుట్ట: సామాజిక న్యాయం, సామాజిక ప్రజాస్వామ్యం ఉమ్మడి లక్ష్యంగా సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తెలిపారు. శనివారం అడ్డగుట్టలో ఆవిర్భావ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. అన్ని రంగాల్లో విధ్వంసానికి గురవుతున్న ప్రస్తుత భౌగోళిక తెలంగాణలో ఎవరెంతమందో వారికంత వాటా నినాదంతో సకల జనుల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ పునర్నిర్మాణం, సామాజిక తెలంగాణ సాధనకై ప్రత్యామ్నాయ రాజకీయాల ద్వారా నిబద్ధత కలిగిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రగతిశీల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు కలిసి సామాజిక తెలంగాణ ఫ్రంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందరికి విద్య, వైద్యం బీసీ కులగణన తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 11న ఉదయం 11 గంటలకు జరిగే సభకు ముఖ్య అతిథులుగా ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్, ఎస్.టి.పి.ఎఫ్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ మురళి మోహన్, కో చైర్మన్ ఆకునూరి మురళి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ హాజరవుతారన్నారు.

వీల్‌చైర్ అందజేత



అడ్డగుట్ట: శాంతినగర్‌కు చెందిన అశోక్ కుమార్ అనే వికలాంగుడికి సెవన్ రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సారా శనివారం వీల్ చైర్ అందజేసి మాట్లాడారు. తమ సంస్థ ద్వారా నిరుపేద వికలాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్నామని ఇలాంటి వారికి అండగా నిల్వడానికి మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అవార్డు ప్రదానం

రసూల్‌పురా: వివిధ న్యూస్ ఛానల్స్‌లో న్యూస్ ప్రజెంటర్స్‌కు ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చిక్కడపల్లిలోని త్యాగరాజ గానసభలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. దూరదర్శన్‌లో న్యూస్ ప్రజెంటర్‌గా పనిచేస్తున్న సికింద్రాబాద్ వెస్ట్‌మారేడుపల్లికి చెందిన ఎం.గౌతమ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. తనకు అవార్డు ఎంతో గర్వకారణంగా ఉందని గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు.



అవార్డు అందుకుంటున్న గౌతమ్‌కుమార్

తిరుమలగిరిలో రన్‌ఫర్ జీసస్



ర్యాలీలో పాల్గొన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: అల్వాల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం తిరుమలగిరిలో శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సమాజహితం కోసం దేవుడి పేరుతో కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమని ఇలాంటి కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు భాగ్యశ్రీ, పాండుయాదవ్, నాయకులు ముప్పిడి మధుకర్, యశ్వంత్‌కుమార్, పాస్టర్స్ అరుణ్ విక్టర్, షాల్మన్, మైఖేల్ స్మిత్, డేవిడ్ సుధాకర్, సోమయ్య. బంటి, అఖిల్ పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో అండర్‌గ్రౌండ్ కేబుల్ నిర్మాణం

సనత్‌నగర్: అల్లావుద్దీన్ కోఠిలో దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న హైటెన్షన్ వైర్ల సమస్య పరిష్కారం దిశగా వడివడిగా పనులు కొనసాగుతున్నాయి. హైటెన్షన్ వైర్లను తొలగించే ప్రక్రియలో భాగంగా భూగర్భ లైన్ ద్వారా కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో పనులు కొనసాగుతున్నాయి. అల్లావుద్దీన్ కోఠిలో దశాబ్దాలుగా ఇక్కడి ఇళ్లపై నుంచి వెళ్లే హైటెన్షన్ వైర్లతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా భూగర్భ కేబుల్ ఏర్పాటుకు వెంటనే అంచనా రూపొందించాలని అధికారులను ఆదేశించి రూ.50 లక్షల నిధులు కూడా మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. ఆ మేరకు పనులు కూడా వేగవంతంగా కొనసాగుతుండడంతో అల్లావుద్దీన్ కోఠి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

24 గంటల షాపుల ప్రతిపాదనను విరమించుకోవాలి



మాట్లాడుతున్న పద్మ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో 24 గంటలు షాపులను తెరుచుకోవచ్చని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నిర్ణయంతో కార్మికులు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలు కల్పించని ప్రభుత్వానికి 24 గంటల షాపుల ప్రతిపాదన పై ఉత్సాహం ఎందుకని ప్రశ్నించారు. 56వ షెడ్యూల్డ్ ప్రకారం కనీస వేతనాల జీవోలను సవరించి అమలు చేయాలేని ప్రభుత్వం 24 గంటలు షాపులకు ప్రతిపాదనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగ భద్రత, రాత్రులు మహిళలకు రక్షణలేని, కనీస వేతనాన్ని చెల్లించకుండా కార్మికులను మరింత శ్రమ దోపిడీ చేసే 24 గంటల షాపుల ప్రతిపాదనను విరమించుకోవాలని లేని పక్షంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఇవే డిమాండ్లతో ఎఫ్ఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం ఓ ప్రకటన విడుదల చేశారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 14న జరిగే జార్జిరెడ్డి వర్ధంతిని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, ఓయూ నేతలు సుమంత్, స్వాతి పేర్కొన్నారు. వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ స్పోర్ట్స్‌లీగ్ పేరుతో నిర్వహించనున్న క్రీడాపోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 10 నుంచి 14 వరకు జరిగే వ్యాస రచన, ఉపన్యాసం, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, క్రికెట్ తదితర పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.



మతసామరస్యాన్ని పెంపొందించేలా పండగలు నిర్వహించుకోవాలి



జ్యూస్ అందజేస్తున్న ధరమ్ రాజ్ చౌదరి

బన్సీలాల్‌పేట్: పండుగలు సమాజంలో మతసామరస్యాం, సోదరభావాన్ని పెంపొందించుకునేలా నిర్వహించుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ధరమ్‌రాజ్ చౌదరి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు శనివారం సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని మసీద్‌లో ఉపవాస దీక్ష విరామ సమయంలో జ్యూస్‌ను పంపిణీ చేశారు. అనంతరం ధరమ్‌రాజ్ చౌదరి మాట్లాడుతూ.. రంజాన్ ముస్లింలకు పవిత్రమైన మాసమని నిష్ఠతో ఉపవాస దీక్షలు ఉంటారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అన్ని మతాల పండుగలు ప్రభుత్వం తరపున ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల 22 వరకు ప్రతి రోజు మసీదులో జ్యూస్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు జె. ఉస్మాన్, అన్వర్, ఇమ్రాన్, అహ్మద్, రాజ్‌కుమార్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు పద్మారావుగౌడ్ ఆదర్శం

హోంమంత్రి మహమూద్ అలీ



పద్మారావుగౌడ్‌ను ఆలింగనం చేసుకుంటున్న హోంమంత్రి మహమూద్ అలీ

సికింద్రాబాద్: నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ మాస్ లీడర్‌గా పేరు సంపాదించుకున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ జీవితం ప్రజాప్రతినిధులకు ఆదర్శం కావాలని హోంమంత్రి మహమూద్ అలీ కొనియాడారు. శుక్రవారం రాత్రి సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ఆవరణలో జరిగిన పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలకు మహమూద్ అలీ హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కారుడు, ప్రజా నాయకుడిగా పద్మారావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ, లింగాని లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటులో పాలకుల నిర్లక్ష్యం



రిలే దీక్షలో పాల్గొన్న మాణికేశ్వర్‌నగర్ ఆటో యూనియన్ నాయకులు

లాలాపేట: చేయిచేయి కలుపుదాం హాస్పిటల్ నిర్మిద్దాం అంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో శనివారం మాణికేశ్వర్‌నగర్ ఆటో యూనియన్ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరం నడిబొడ్డున దాదాపు 20 వేలకు పైగా జనాభా ఉన్న వడ్డెర బస్తీలో కనీస వసతి హాస్పిటల్ సదుపాయం ఏర్పాటు చేయకపోవడం పాలకుల అసమర్థతకు నిదర్శనం అన్నారు. ఓయూ కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలిచిన మాణికేశ్వర్‌నగర్ అభివృద్ధిని పాలకులు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి తక్షణమే ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేముల శ్రీనివాస్, బోదాసు ఎల్లయ్య, ఆలకుంట మైసయ్య, ఏ. శ్రీనివాస్, వి. వెంకటయ్య, గోగుల శ్రీను, వెంకటేష్ దీక్షలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అధికారుల చేతివాటం?

పాత వైరింగ్ ఉండగా కొత్తగా చేసినట్లు బిల్లు కోసం ప్రతిపాదనలు



గేటు పిల్లర్లకు గ్రానెట్స్ పెట్టకుండా వదిలేసిన దృశ్యం

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రకృతి చికిత్సాలయంలో జరిగిన అభివృద్ధి పనుల్లో సంబంధిత అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు సమాచారం. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అభివృద్ధి పనుల కోసం రూ.10 కోట్లు కేటాయించారు. నూతనంగా ఎలాంటి భవనాలు నిర్మించనప్పటికి అప్పటికే ఉన్న కాటేజీలు, ఆసుపత్రి భవనం, యోగాశాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు, ఫర్నిచర్ కొనుగోలుతో పాటు కొన్ని చోట్ల గ్రీనరీ ఏర్పాటు చేశారు.అయితే పాత భవనాలకు ఎలాంటి వైరింగ్ చేయనప్పటికీ చేసినట్లుగా చూపించి బిల్లు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.ఈ బిల్లులు కోట్లలో ఉన్నట్లు సమాచారం. అలాగే ఆసుపత్రి ప్రధాన గేట్ల పిల్లర్లకు గ్రానెట్ రాళ్లు పెట్టాల్సి ఉండగా వదిలేశారని కొందరు ఉద్యోగులు వాపోతున్నారు. గేటు పిల్లర్‌కు అక్కడక్కడ సిమెంటు ఊడిపోయి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని బట్టి చూస్తే పనుల్లో ఎంత నిర్లక్ష్యం వహించారో ఇట్టే అర్థమవుతుంది. ఈ విషయమై సంబంధిత విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీయర్‌ను వివరణ కోరగా తనకేమి తెలియదని, డిప్యూటీ ఈఈకే తెలుసన్నారు. ఆ అధికారికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్ కార్యకర్త మృతి



సతీష్‌కుమార్(ఫైల్)

బన్సీలాల్‌పేట్: రోడ్డు ప్రమాదంలో బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సతీష్‌కుమార్ (43) మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సతీష్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న మీర్‌పేట్‌లోని బంధువులను కలిసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో సతీష్‌కుమార్ మరణించాడని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా మీర్‌పేట్ పోలీసులు శవాన్ని ఉస్మానియా ఆసుపత్రిలో భద్రపర్చారు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి వారం దాటినా రాకపోవడంతో కుటుంబీకులు గాంధీనగర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆరా తీయగా విషయం బయటపడింది. కుటుంబీకులు శనివారం ఉస్మానియా ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని బన్సీలాల్‌పేట్‌కు తరలించారు. సతీష్ కుమార్ మృతితో బన్సీలాల్‌పేట్ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది. సతీష్ మరణవార్త తెలియగానే బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, రాజేందర్ తదితరులు సతీష్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. సతీష్‌కుమార్ మరణం బీఆర్‌ఎస్‌కు తీరని లోటని కార్పొరేటర్ హేమలత లక్ష్మీపతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

సికింద్రాబాద్: కదులుతున్న రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం 11.30 లకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరుతున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి బిహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన యదునందన్‌రాజ్ (71) డోర్ వద్ద నుంచి జారి బోగీకి మధ్యలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆధార్ కార్డులోని వివరాల ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.